www.prajasakti.com
# ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024
5
ఏలూరు

## నేడు చింతలపూడిలో చంద్రబాబు సభ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధ్యక్షుడు, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదలిరా.. బహిరంగ సభ సోమవారం చింతలపూడి మండలం ఆంథోని నగర్‌లో జరగనుంది. చంద్రబాబు ఉదయం అనకాపల్లి జిల్లాలో రా కదలి రా సభలో పాల్గొని సాయంత్రం మూడు గంటలకు హెలీకాప్టర్‌లో చింతలపూడి చేరుకుంటారు. దాదాపు గంటన్నర 4.30 గంటల వరకూ బహిరంగ సభలో మాట్లాడతారు. తిరిగి హెలీకాప్టర్‌లో 5.15 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడిపి నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. జనం పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు.

# 'గుడ్డు' గూడుపురాణి..!

**స్కూళ్లలోని 'జగనన్న గోరుముద్ద'లో గుడ్డు దోపిడీ**

**విద్యార్థులు రాకపోయినా గుడ్లు తీసుకోవాల్సిందేనని హుకుం**

**కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రత్యేక ఆదేశాలు**

**మిగిలిన గుడ్లు చెడిపోయినట్లు రాసుకోవాలని సమాధానం**

**రూ.కోట్ల ప్రజాధనం కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు వ్యూహం**

**గడువు ముగిసిన 'చిక్కీ'లు**

**అంటగడుతున్నా పట్టని అధికారులు**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యార్థులకు అందించే కోడి గుడ్డులోనూ పెద్దఎత్తున దోపిడీకి అధికారికంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ గతంలో కొనసాగిన నిబంధనలకు విరుద్ధమైన ఆదేశాలను ప్రభుత్వం జారీచేసిన పరిస్థితి నెలకొంది. స్కూళ్లకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య బట్టి కాకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా కోడిగుడ్లు తీసుకోవాలంటూ హుకుం జారీచేసిన పరిస్థితి నెలకొంది. మిగిలిపోయిన వందల సంఖ్యలో కోడిగుడ్లను చెడిపోయినవిగా లెక్కలు చూపించాలంటూ ఇస్తున్న సమాధానంతో స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి. 'జగనన్న గోరుముద్ద' కింద గుడ్డు సరఫరాలో ఇప్పటివరకూ సాగిన నిబంధనలు ఏంటి? కొత్తగా జారీచేసిన ఆదేశాలు ఏంటో ఒక్కసారి పరిశీలిస్తే దోపిడీ గుట్టు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.231 స్కూళ్లలో 'జగనన్న గోరుముద్ద' (మధ్యాహ్న భోజనం) కొనసాగుతోంది. మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధిపొందుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ పథకం కింద తినే మధ్యాహ్న భోజనంలో వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు వేస్తారు. ఐదు రోజులకు సరిపడా ఒకేసారి కోడిగుడ్లను కాంట్రాక్టర్ స్కూళ్లకు అప్పగిస్తారు. ఒక హైస్కూల్లో మొత్తం 300 మంది విద్యార్థులుంటే ప్రతిరోజూ సరాసరి హాజరయ్యే విద్యార్థులు 260 మంది వరకూ ఉంటారు. దీన్నిబట్టి ప్రధానోపాధ్యాయులు గుడ్లు

తీసుకుంటారు. చాలా కాలంగా ఇదేవిధానం కొనసాగుతోంది. స్కూళ్లలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగుతోంది. ఇప్పుడు ఒక్కసారిగా కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూర్చే విధంగా కొత్త ఆదేశాలు తెరపైకి తెచ్చారు. స్కూళ్లలో ఉన్న ఎన్‌రోల్‌మెంట్ (చేరిన విద్యార్థులు) సంఖ్య ఆధారంగా కోడిగుడ్లు తీసుకోవాలంటూ హుకుం జారీచేశారు. ఆన్‌లైన్ చూపిస్తున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇండెంట్ తీసుకోవాలంటూ ఆదేశాలు తీసుకొచ్చారు. ఈ ప్రకారం తీసుకుంటే తక్కువగా లెక్కించిన 300 మందికిపైగా విద్యార్థులున్న స్కూళ్లలో వారానికి 200 నుంచి 300 గుడ్లు మిగిలిపోయే పరిస్థితి ఏర్పడనుంది. మిగిలిపోయిన గుడ్లను ఏంచేయాలని అడిగితే మాత్రం చెడిపోయినట్లుగా (డ్యామేజ్) రాయాలంటూ సమాధానం ఇస్తున్నారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 3,231 స్కూళ్లు ఉండగా మిగిలిపోయే గుడ్లు సరాసరి లెక్కించినా దాదాపు వారానికి 40 వేలకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. గుడ్డు రూ.ఐదు చొప్పున లెక్కించినా వారానికి రూ.20 లక్షలపైగా, నెలకు రూ.కోటికి పైగా ప్రజాధనం ఈ జిల్లాలోనే కాంట్రాక్టర్లకు దోచిపెట్టే పనికి పూనుకున్న పరిస్థితి నెలకొంది. ఈ లెక్కలు ప్రాథమికంగా వేసినవి మాత్రమే. పూర్తిస్థాయిలో లెక్కలు తీస్తే దోపిడీపర్వం భారీగా ఉంటుందున్న చర్చ నడుస్తోంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా దోపిడీ ఎంత ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. మిగిలిన గుడ్లను తర్వాత వారం వాడుకునేందుకు వీలులేదని ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లక్షల సంఖ్యలో గుడ్లు వృథాగా పక్కకు పడేయాల్సి వస్తుంది. కాంట్రాక్టర్‌కు మేలు చేయడానికి ప్రజల సొమ్మును వృథా చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజూ స్కూల్‌కు హాజరయ్యే విద్యార్థులను బట్టి కాకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా కోడిగుడ్లు తీసుకుని వృథాగా పడేయాలని చెప్పడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఈ విధానాన్ని అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు రావడం, ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలివ్వడం జిల్లాలో జరిగిపోయింది.



Good evening to all AD s,

**very important alert regarding Egg and chikki supply**

I am sharing the indent placed by our HM 's and DEO must take due care and ensure HM 's must not go against the placed indent .

1.HM shall not ask more than the indent ,if taken more we are not concerned about the extra and it's payment,HM will be held responsible.

2.HM must not see balance of previous phase eggs and should not deny taking from supplier when supplied as per indent in next phase.

**INDENT MUST BE STRICTLY COMPLIED**

When HM is doing any of the above mentioned conditions supplier will alert us and immediately DEO will be given information and HM should be given show cause calling explanation.

DEO should take up the responsibility of educating all HM s on this.

Regards,

రోల్‌ను బట్టి గుడ్లు తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులకు జారీచేసిన ఆదేశాలు

### గడువు ముగిసిన చిక్కీలిచ్చినా అడిగే నాథుడే కరువు..

గడువు ముగిసిన చిక్కీలు స్కూళ్లకు సరఫరా చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. నిబంధనల ప్రకారం చిక్కీలు నెలకు రెండు సార్లు స్కూళ్లకు సరఫరా చేయాలి. అలాకాకుండా నెలకు ఒకేసారి చిక్కీలను కాంట్రాక్టర్ సరఫరా చేసేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతోంది. ప్రస్తుతం స్కూళ్లకు అందించిన చిక్కీలు డిసెంబర్ 25న తయారయ్యాయి. వీటికి గడువు తేదీ ఫిబ్రవరి 22వ తేదీ వరకూ ఉంది. అయితే మార్చి మొదటివారానికి సరిపడా చిక్కీలను స్కూళ్లకు సరఫరా చేసేశారు. గడువు దాటిన చిక్కీలనే విద్యార్థులకు పెట్టాల్సిన పరిస్థితి ప్రధానోపాధ్యాయులకు ఏర్పడుతోంది. అదేంటని అడిగితే సరైన సమాధానం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు నోరుమెదపడం లేదు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే పరిస్థితి ఉన్నా పట్టించుకోకపోవడం ఏ ఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. దీనిపై ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

# కొవ్వాడలో పులి పాదముద్రలు

## అప్రమత్తంగా ఉండాలి : అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు

బుట్టాయగూడెం మం డలం కొవ్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొవ్వాడ గ్రామ పరిసరాలలో పులి పాదముద్రలు గుర్తించడమైందని డిఎఫ్ఒ రవీంద్ర ధామ తెలిపారు. కొవ్వాడ సమీప గ్రామాలైన రాజవరం, యర్రయిగూడెం, కామయ్యకుంట, లంకాలపల్లి, నాగన్నగూడెం, బండార్లగూడెం, పండుగూడెం, కోపల్లి, వీరన్నపాలెం, డిప్పకాయలపాడు, కన్నాపురం గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. పులి తిరుగు ప్రయాణంలో ఉన్నట్లుగా పాదముద్రికల ద్వారా గుర్తించారు. ఆటవీశాఖ వారు పులి సంచరించే ప్రాంతానికి అన్నివైపుల చుట్టూ 10 కి.మీ దూరంలో ఉన్న సుమారు 10 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడానికి మైకు ద్వారా ప్రచారం చేశారు. ఎన్‌టిపిఎ న్యూఢిల్లీ వారి సూచనలతో కెమారాలు, నిరంతరం పులి కదలికలను తెలుసుకోవడానికి టీంల ద్వారా పెట్రోలింగ్ చేస్తున్నారు. మైకు ద్వారా పైన తెలిపిన చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు తగు జాగ్రత్తలు, సూచనలు చేస్తూ అప్రమత్తంగా ఉండాల్సిందిగా అటవీశాఖ అధికారులు తెలియజేశారు.

సభా స్థలిని పర్యవేక్షిస్తున్న అధికారులు

# చంద్రబాబు సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో ఈ నెల 5వ తేదీన జరగనున్న రా కదిలి రా కార్యక్రమానికి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని, సభను జయప్రదం చేయాలని ఏలూరు పార్లమెంట్ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. చింతలపూడి జరగబోయే రా కదలి రా భారీ బహిరంగ సభ ప్రాంగణాన్ని పర్యవేక్షించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రా కదిలిరా కార్యక్రమం ఎక్కడ పెట్టినా ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తిపోయారని వైసిపిని గద్దె దించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని ప్రజలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 5న జరిగే బహిరంగ సభకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. టిడిపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా ఎస్‌పి**

సోమవారం జరగబోయే రా కదిలి రా కార్యక్రమాన్ని సభ ప్రాంగణాన్ని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి నాయకులు, అధికారులతో చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి శ్రీనివాస్

# సంక్షేమం, అభివృద్ధే వైసిపి అస్త్రాలు

## ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే వైసిపిని గెలిపిస్తాయని ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని దర్భగూడెం పంచాయతీలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి.రాంబాబు సతీమణి పద్మావతి రెండో వర్ధంతి సందర్భంగా పంచాయతీలోని మహిళలకు చీర, గాజులు, పంపిణీ చేశారు. అనంతరం కొల్లూరి.పద్మావతి, కుమారుడు దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన సొంత నిధులతో దర్భగూడెం పీటర్ పాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం నూతన బోర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దర్భగూడెం ఎస్‌సి కాలనీలో తాగునీటికి ఇబ్బందిగా ఉండటంతో అక్కడ బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బాపూజీ కాలనీలో వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలే మళ్లీ వైసిపి విజయానికి దోహదపడతాయన్నారు. ప్రతిపక్షాలు అందరూ ఏకమై ఎన్ని కుట్రలు చేసిన వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం.ఉషారాణి, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిటిసిలు సున్నం.సురేష్, సుధారాణి, వైసిపి నాయకులు కొప్పుల చౌదరారెడ్డి, ప్రకాశం, పిచ్చిరెడ్డి, సురేష్, రవి, జి.వేణు, పైడిమర్ల జగన్ పాల్గొన్నారు.

# పోలవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, విద్యా, వైద్య, వ్యాపార తదితర అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన పోలవరంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చెయ్యాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల ఐక్యవేదిక జెఎసి అధ్యక్షులు నాళం గాంధీ అన్నారు. ఆదివారం పోలవరంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు సొబ్బన మోహన్, దొంతల పోసివర్మ, పెంటపాటి జిమ్మీ ఆధ్వర్యంలో పోలవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో కుల సంఘాలు, ప్రజాసంఘాలతో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాళం గాంధీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని ఆశించామన్నారు. కాని ఆశలు నెరవేరకపోగా ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు, వర్గాలకు, కుల, మతాలకు అతీతంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు, పోలవరం అభివృద్ధి చేయడానికి ప్రజలందరూ ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అడ్వకేట్ సొబ్బన ఆనందరావు మాట్లాడుతూ పాలకులు మారుతున్నా పోలవరం అభివృద్ధి చెందకుండా నిర్లక్ష్యంకు గురవుతుందన్నారు. పంచాయతీల తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం నిర్వాసిత త్యాగమూర్తులకు ప్రత్యేక జిల్లా వేసి బహుమతిగా ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. కూలీ పనులు, ఉపాధి లేక బతుకుతెరువు కోసం వలసలు వెళ్లే పరిస్థితులు వచ్చాయని జిల్లా మేకల గొర్రెల సంఘం డైరెక్టర్ కోరసిక నాగబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెరుమాళ్ల బాబు, విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షులు తుమ్మలాడ పోసిబాబు, పంచాయతీ వైస్ ప్రెసిడెంటు కోరసిక శ్రీను, పాస్టర్లు పిజె.సుధాకర్, డి.డన్నిబాబు, ఎస్‌టియు మండల అధ్యక్షులు పూణే పోసిబాబు, యాదవ సంఘం మండల అధ్యక్షులు రాచూరి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు

# రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలూరుకు చెందిన కె.రమేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని రెవెన్యూ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగోన్నతుల్లో భాగంగా ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందడం ద్వారా ఖాళీ అయిన స్థానంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోసం ఎన్నిక జరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏలూరు జిల్లా అధ్యక్షుడు కంచర్లపల్లి రమేష్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

రమేష్ కుమార్‌ను అభినందిస్తున్న సభ్యులు

# 11న యాదవ సంఘం జిల్లా భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదవ సంఘం జిల్లా భవనం ప్రారంభోత్సవం ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని యాదవ సంఘం జిల్లా నాయకులు తెలిపారు. యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడారు. ఏలూరులో సంఘ భవనం నిర్మించుకోవాలన్నది జిల్లా యాదవుల చిరకాల ఆకాంక్ష అన్నారు. ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ఔదార్యం కారణంగా యాదవుల దశాబ్దాల కల ఇన్నాళ్లకు సాకారమవుతుందన్నారు. ఎంఎల్‌ఎ నాని యాదవుల అవసరాలను, ఆకాంక్షలను పరిశీలనలోకి తీసుకుని, సంఘం అభ్యర్థనను గౌరవించి ఏలూరు నగర నడిబొడ్డున, తమ్మిలేరు ఒడ్డున, కలెక్టర్ కార్యాలయం వెనుక రోడ్డులో భవన నిర్మాణానికి విలువైన స్థలాన్ని ఉదారంగా ఇచ్చారని వారు వివరించారు. స్థలం మంజూరు చేయడమే కాకుండా, రూ.14 లక్షల ప్రభుత్వ నిధులు కూడా కేటాయించిన ఆళ్ల నాని ఉదారత మరువలేనిదని యాదవ సంఘం జిల్లా నాయకులు కొనియాడారు. ప్రభుత్వ నిధులకు తోడు జిల్లా వ్యాప్తంగా అనేక మంది యాదవ సోదరులు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాలతో యాదవ సంఘ భవనం నిర్మాణం జరిగిందని వివరించారు. ఈనెల 11న ఆళ్ల నాని చేతుల మీదుగా ఈ భవన ప్రారంభోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొంటారన్నారు.

# వంతెన కూలి ఆరేళ్లు.. నిర్మాణానికి ఇంకెన్నాళ్లు..!

## స్పందన ఫిర్యాదులు బుట్టదాఖలేనా

ప్రజాశక్తి - ఉంగుటూరు

రావులపర్రు-ప్రకాశరావుపాలెం ఆర్‌అండ్‌బి రహదారిపై రావులపర్రు-ఉంగుటూరు మధ్య పత్తేపురం పంట కాలువపై చిన్నపాటి వంతెన కూలి సుమారు ఆరేళ్లు దాటింది. నేటి వరకూ దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. సీతారామపురం, రాచూరు, దొంతవరం, రావులపర్రు గ్రామస్తులు మండల కేంద్రమైన ఉంగుటూరు రావాలంటే ఇదే దగ్గర మార్గం. రావులపర్రు-ప్రకాశరావుపాలెం ఆర్‌అండ్‌బి రోడ్డు మార్గంలో తోకలపల్లి మేజర్ మురుగుకాలువ లాకుల సమీపంలో ఈ వంతెన ఉంది. రావులపర్రు, కాగుపాడు, రాచూరు, దొంతవరం రైతులు, ప్రజలు ఉంగుటూరు రావాలంటే ఈ వంతెన నిర్మాణానికి ముందు పంట కాలువలో దిగి నీళ్లల్లో తడిచి రావాల్సి వచ్చేది. ఈ సమస్యను గుర్తించిన అప్పటి ప్రజాప్రతినిధులు సుమారు ఐదు దశాబ్దాల క్రితం రైతుల సహకారంతో సుమారు నాలుగు మీటర్ల వెడల్పు, ఆరు మీటర్ల పొడవైన వంతెన నిర్మించారు. దీంతో వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ప్రజల రాకపోకలకు ఈ వంతెన ఎంతో కీలకంగా మారింది. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 16 వేల మంది ప్రజలు ఈ వంతెనను వినియోగించుకుంటున్నారు. అలాంటి ఈ వంతెన శ్లాబ్ దెబ్బతిని 2019 ఎన్నికలకు ముందే కూలిపోయింది. అప్పటి టిడిపి ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదు.

ఎన్నికల అనంతరం ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. స్థానికులే తాత్కాలికంగా ఈ వంతెన పక్కనుంచి పంట కాలువపై కంకర రోడ్డు నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రావులపర్రు నుంచి కాగుపాడు జెడ్‌పి హైస్కూల్‌కు సుమారు 70 మంది విద్యార్థులు నిత్యం సైకిళ్లపై వెళ్లొస్తున్నారు. కంకర రోడ్డు వర్షాకాలంలో జారిపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఏదైనా పొరపాటున సైకిల్ జారితే పంట కాలువలోకి పడిపోయే ప్రమాదం ఉందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఈ వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రకాశరావుపాలెం-ఉంగుటూరు ఆర్‌అండ్‌బి రహదారిని బిటి, సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు వెచ్చింది. అయినా ఈ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంపై ఆ ప్రాంత ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభావిత గ్రామాల సర్పంచులు సైతం మండల సమావేశంలో అనేకసార్లు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రావులపర్రు వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెన..

### స్పందనలో ఫిర్యాదు చేశా

ఈ వంతెన ప్రాధాన్యత రీత్యా సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్పందనలో ఫిర్యాదు చేశాను. టెండర్ల దశలో ఉందని, ఖరారు కాగానే వంతెన నిర్మిస్తామని ఆర్‌అండ్‌బి అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ వంతెన నిర్మాణం చాలా అవసరం.

ఎంపిపి గంటా శ్రీలక్ష్మి

# చింతలపూడి స్వతంత్ర అభ్యర్థిగా మువ్వల ఎస్తేరు రాణి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మువ్వల ఎస్తేరు రాణి ఆదివారం తెలిపారు. జంగారెడ్డిగూడెం అన్నపూర్ణ హెరిటేజ్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీలు దళితులను అవసరానికి వాడుకుంటున్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయని, రహదారులు, మంచి నీరు, స్థానిక సమస్యలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పోలవరం నిర్వాసిత కాలనీల్లో పర్యటించానన్నారు. నన్ను ఎంఎల్‌ఎగా గెలిపిస్తే రహదారులు నిర్మాణాలు చేస్తా, సబ్ స్టేషన్లు నిర్మాణం చేపడతానని తెలిపారు. గతంలో బహుజన సమాజ్ పార్టీలో పోటీ చేశాను, ప్రస్తుతం ఏపార్టీతో పొత్తు లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు.


ఇనాక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## పద్మశ్రీ ఇనాక్‌కు సన్మానం

**ప్రజాశక్తి - ద్వారకా తిరుమల**

ఇనాక్ తన రచనల ద్వారా అన్ని ప్రక్రియలను ప్రభావితం చేశారని తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు అన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడి గూడెం హైస్కూలులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌ను శాలువాతో సత్కరించి సన్మానం కార్యక్రమం నిర్వహించారు. తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు, హెడ్ మాస్టర్ పి.సురేష్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ బాల్యంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కష్టపడి చదివి, ఆకలి బాధలను, వివక్షతలను తట్టుకుని ఉప కులపతి, పద్మశ్రీ వరకు ఎదిగిన తీరును ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - కుక్కునూరు**

మండల కేంద్రంలో జంగారెడ్డిగూడెం పట్టణ అక్షయ ప్రైమరీ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. నేత్ర సమస్యలతో బాధపడుతున్న సుమారు 100 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన రోగులకు ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు పేర్కొన్నారు. కాగా అవసరమైన రోగులకు రాయితీతో కూడిన కళ్ల జోళ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షయ ప్రైమరీ నేత్ర వైద్యులు, కుక్కునూరు రెయిన్ బో రక్త పరీక్ష కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## కూలీలకు కనీస వేతనం అమలు చేయాలి

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆదివారం యూనియన్ కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ బీమా సౌకర్యాలు కల్పించాలని, యూనియన్ ఉపాధి కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు.

# నేరాలు - ఘోరాలు

## తెలంగాణ మద్యం పట్టివేత

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

తెలంగాణా నుంచి ఆంధ్రాకు కారులో మద్యం తరలిస్తున్న వ్యక్తిను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా నుంచి ఆంధ్రాకు కారు క్యాబిన్‌లో పెట్టుకొని 48 మద్యం బాటిళ్లతో వస్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుకున్న మద్యంతో పాటు కారును సీజ్ చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## నాటుసారా విక్రేతపై కేసు నమోదు

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బండివారిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వం నిషేధించిన నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా తెర్లం మండలం రాజయ్యపేట గ్రామానికి చెందిన సేనాపతి సూర్యనారాయణ(59)గా అతనిని గుర్తించారు. ఏలూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు బండి ఆదివారం అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు

**ప్రజాశక్తి - ముసునూరు**

కోడిపందేలు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, బైండోవర్ చేయడమైందని ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. ముసునూరు మండలం లోపూడి గ్రామంలో లింగంపాలెం మండలానికి చెందిన సురేష్, కొంతమంది వ్యక్తులు తరుచూ పందేలు నిర్వహిస్తూ ఉంటారు. ఈమేరకు ముసునూరు ఎస్ఐ వాసు తమ సిబ్బందితో సురేష్ అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా ఆదివారం అదే గ్రామంలో పందేలు వేస్తానని సమాచారంతో వచ్చానని చెప్పడం జరిగింది. సురేష్‌పై 107 సెక్షన్ కింద చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, రూ.లక్ష బాండు, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి ఇకపై పందేలు, జూదాలు ఆడకుండా ఉండుటకు బైండోవర్ చేయడమైందన్నారు. ఇకపై ఎవరైనా మండలంలో కోడిపందేలు, పేకాట, జూదం నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలతో పాటు రౌడీ షీట్ తెరుస్తామని ఎస్ఐ తెలియజేశారు.

## మినీవ్యాన్ ఢీకొని యువకునికి గాయాలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మినీ వ్యాన్ బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో బైక్‌పై ఉన్న యువకుడు గాయపడిన సంఘటన ఆదివారం ముదినేపల్లిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌కి చెందిన దరిశే విజయ్ కుమార్ స్థానిక గుడివాడ రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. బంకు వద్ద నుంచి బైక్‌పై సెంటర్‌కు బయలుదేరిన విజయ్ కుమార్ బైకుకు ఎదురుగా గుడివాడ వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా విజయ్ కుమార్ ముఖంపై గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుని స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయించారు. ఈ ప్రమాద సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాలేదు.

## మనస్తాపంతో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

భార్య కాపురానికి రావడం లేదని ఒక వ్యక్తి పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు మండలం మేదినరావుపాలెం గ్రామానికి చెందిన ములగాల రాజు(30)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భార్యా భర్తల మధ్య విబేధాలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను కాపురానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా ఆమె నిరాకరిచడంతో జీవితంపై విరక్తి చెందిన అతను రెండు రోజుల క్రితం పురుగు మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై దెందులూరు ఎస్ఐ కె.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# ఎవరు అర్హులు..!

## హెల్త్ అసిస్టెంట్లకు అన్యాయం

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

**ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్(మేల్) ఉద్యోగులను క్రమబద్ధీకరించే క్రమంలో వైద్యారోగ్య శాఖ చేసిన తప్పులకు అభ్యర్థులు బలైపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 273 జిఒలో పని చేస్తున్న పదో తరగతి అభ్యర్థులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, 1207 జిఒలో పని చేస్తున్న అర్హులైన ఇంటర్ అభ్యర్థులను పక్కన పెడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం అని ఆయా అభ్యర్థులు వాపోతున్నారు. జిఒ ఎంఎస్ నెంబర్ 114ను వెంటనే అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.**

2002లో ఎంపిహెచ్ఎ(మేల్) కాంట్రాక్ట్ సర్వీస్‌లో 205 నియామకాలు చేపట్టారు. 2003 జూన్ 5న అప్పటి ప్రభుత్వం జిఒఎంఎస్ నెంబర్ 273 హెచ్ఎం, ఎఫ్‌డబ్ల్యూ డిపార్టుమెంట్ హెచ్(1డిటి) 24 ఏప్రిల్ 1989 రూల్ 4ను అనుసరించి గెజిట్‌లో అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ పోస్టులకు ఇంటర్ అర్హతగా ఉంది. దీంతో జిల్లాలో 212 ఖాళీ పోస్టులను గుర్తించి, ఇంటర్మీడియట్ అర్హత కలిగిన 212 మంది అభ్యర్థులను ఆర్డర్ ఆఫ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో నియమించారు. ఈ విషయమై నోటిఫికేషన్‌లో 10వ తరగతి అర్హతతో ఉండగా ఇంటర్ అభ్యర్థులను ఎలా నియమిస్తారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. 2003 సెప్టెంబర్‌లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో టెన్త్ క్లాస్ వారిని విధుల్లోనికి తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ జిల్లాలో సుమారు 64 మందికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో నియామకాలు చేపట్టింది. ఇదే విషయమై మరికొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కాంట్రాక్ట్ సర్వీస్‌లో ఉన్న అందరినీ తొలగించి, తిరిగి జనరల్ మెరిట్‌తో ఉన్న అభ్యర్థులతో నోటిఫికేషన్‌లో ఉన్న పోస్టులను (205) భర్తీ చేయాలని జిఒఆర్‌టి నెం 273 ఇవ్వడం ద్వారా 2003 ఇంటర్ క్వాలిఫికేషన్, 2006 10వ తరగతి అర్హతతో నియామకమైన అభ్యర్థులు 104 మంది తొలగించబడ్డారు. తిరిగి 2013లో జిఒఆర్‌టి 1207 ద్వారా తొలగించబడిన 104 మంది అభ్యర్థులను వారి స్థానాలలో నియమించబడ్డారు. కొంతమంది అభ్యర్థులు మాకంటే తక్కువ మార్కులు ఉన్న అభ్యర్థులు ఉద్యోగాల్లో ఉన్నారు.. మాకు ఉద్యోగాలు కల్పించాలని కోర్టును ఆశ్రయించగా 2017 ఏప్రిల్ 14న 104 పోస్టులకు ఆర్ఒఆర్ వేసి డబ్ల్యుపి 3 నెం ద్వారా 44 మంది అభ్యర్థులను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. తొలగించబడిన 44 మంది అభ్యర్థులు కోర్టు ఆదేశాల మేరకు 2017 జులై ఒకటో తేదీ నుంచి విధుల్లో కొనసాగుతున్నారు. కొంతమంది అభ్యర్థులను జిల్లాలో నియమించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్ క్రమంలో నిధి పోర్టల్‌లో వారి జాబితాలను అప్లోడ్ చేసే క్రమంలో 1207 జిఒ ద్వారా నియమించబడ్డ 104 మంది అభ్యర్థులకు రోస్టర్ పాయింట్లు లేని కారణంగా వారి రెగ్యులైజేషన్ ప్రక్రియను నిలుపుదల చేశారు. ఇదే విషయమై అనేకసార్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజ్ఞాపన పత్రాలు ఇచ్చిన ఏవిధమైన స్పందనా లేదు. ఇంత వరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రక్రియను జిల్లా అధికారులు చేయకుండా కాలయాపన చేశారు. 2014 జూన్ 2వ తేదీకి ముందు నియామకమై నేటి వరకు ఉద్యోగం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఈ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఆదేశిస్తే 2017లో వేసిన కోర్టు కేసులను బూచిగా చూపించి 1207 జిఒలో పనిచేస్తున్న 104 మంది అభ్యర్థులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై నేటి వరకు పనిచేస్తున్న ఎంపిహెచ్ఎ మేల్ అభ్యర్థులను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2017లో ఫైల్ అయిన కోర్టు కేసులో ఉన్న అభ్యర్థులు 2014కు ముందు నియామకం కానప్పటికీ వారిని బూచిగా చూపించడం హాస్యాస్పదం. నిజానికి సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిమెంట్‌ల్లో ఎంపిహెచ్ఎ మేల్ పోస్టులకు (కాంట్రాక్ట్ సర్వీస్) 10వ తరగతి అర్హతగాని, రెగ్యులర్ పోస్ట్‌కు ఇంటర్ తర్వాత డిప్లమో చేసినవారు అర్హత అని తీర్పు ఇచ్చారన్నారు. అయితే 2022 జనవరి 4లో ప్రభుత్వం ప్రకటించిన గెజిట్‌లో కూడా డైరెక్ట్ పోస్ట్ (పర్మినెంట్)కు ఇంటర్ బేసిక్ అర్హత అని ప్రకటించారు. ఎప్పుడూ రెగ్యులర్ పోస్టులకు ఇంటర్ కనీస అర్హత అని హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రకటించింది. దీనికి విరుద్ధంగా అధికారులు 273 జిఒలో పని చేస్తున్న పదో తరగతి అభ్యర్థులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి అర్హులైన, 1207 జిఒలో పని చేస్తున్న ఇంటర్ అభ్యర్థులను పక్కన పెడుతున్నారు. ఇది ఎంత వరకు సమంజసం అని అభ్యర్థులు వాపోతున్నారు. 2014కు ముందు ఈ జిల్లాలో 79 పిహెచ్‌సిలు, 610 సబ్ సెంటర్లలో 399 ఎంపిహెచ్ఎ (మేల్) మంజూరైన పోస్టులు ఉండగా నేటికీ 442 మంది పని చేస్తున్నారు. 205 పోస్టుల్లో 164 మంది అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. మిగిలిన 41 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని తర్వాత మెరిట్ ఉన్న వారిని నియమిస్తారా, లేదా అనే అంశంపై అధికారుల వద్ద సమాధానం లేదు. అధికారులు వాస్తవాలను గ్రహించి 2003లో నియమితులైన వారు క్రమబద్ధీకరణ రూల్స్‌కు అన్నివిధాలుగా (ఆర్ఒఆర్) అర్హులు. కాబట్టి వారిని యధావిధిగా రెగ్యులర్ చేయాల్సిందిగా కోరారు. జిఒ ఎంఎస్ నెం.114ను వెంటనే అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

**ఆర్ఒఆర్ రాసి, నిధి పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయాలి**

జిఒ ఆర్‌టి నెంబర్-2114 కాంట్రాక్టు ఉద్యోగులకు క్రమబద్ధీకరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అనుసరించి 2014 జూన్ 2న ముందు నియామకాలు పొందిన అభ్యర్థులను, నియామకం పొందిన తేదీ నుంచి నేటి వరకూ ఉద్యోగంలో కొనసాగుతున్న అభ్యర్థులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది. అయితే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఏలూరు వారు 205 పోస్టులకు పాత ఆర్ఒఆర్ వారి విధానంతో అప్‌లోడ్ చేస్తూ 1207 ద్వారా నియామకాలు పొందిన 104 మంది అభ్యర్థుల కడుపు కొడుతున్నారు. ఆర్ఒఆర్ లేనిదే నిధి పోర్టల్‌లోకి అప్‌లోడ్ కాదు. అప్‌లోడ్ అయితేగాని రెగ్యులర్ ఆర్డర్స్ రావు. కావున అధికారులు ఆర్ఒఆర్ వేసి నిధి పోర్టల్‌లో అప్లోడ్ చేసిన ఎడల 205 పోస్టులకు గాను 164 మంది ఉద్యోగం చేస్తున్నారు. 41 ఖాళీలు మిగిలి ఉన్నాయి గనుక 1207లో అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. 1207 వృద్ధులకు, అభ్యర్థులకు కోర్టు కేసు అడ్డంకి ఉందని కప్పదాటు మాటలు చెబుతున్నారు. నిజానికి డబ్లుపిఒ నెం.38036 ద్వారా 2013లో కోర్టు కేసులో ఉన్న అభ్యర్థులకు నియామకాలు జరిగాయి. కోర్టు తీర్పు ఎలా ఉన్నా.. 2014కు ముందు ఉద్యోగాలలో ఉన్న అభ్యర్థులకు ఎలాంటి అడ్డంకి లేదు. కావున ఆర్ఒఆర్ రాయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

# నేడు చింతలపూడిలో 'రా కదలి రా'

## టిడిపి అభ్యర్థిని ప్రకటిస్తారనే ఆశతో నియోజకవర్గ ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ

**ప్రజాశక్తి - చింతలపూడి**

ఈనెల 5వ తేదీన రా కదిలి రా కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రావటంతో చింతలపూడి నియోజకవర్గ ఆశావాహులలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నేడు జరగబోయే సభలో చింతలపూడి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిని ప్రకటిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎవరి పేరు ప్రకటిస్తారో అని చింతలపూడి నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే ఆశావాహులలో ఆకుమర్తి రామారావు, తలారి నాగ లింగాస్వామి, బొమ్మాజి అనిల్, సోంగ రోషన్ కుమార్, మాజీ మంత్రి పీతల సుజాత తమ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చింతలపూడి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి సీటును ఆశిస్తున్నారు. ఇప్పటికే చింతలపూడి మండలంలో సభా ప్రాంగణం మొత్తం అభ్యర్థుల ఫ్లెక్సీలతో నిండిపోయింది. అధిష్టానం మెప్పు కోసం తాపత్రయపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అభ్యర్థిని ప్రకటిస్తే ఎన్నికల పనులలో నిమగ్నం అవ్వచ్చని భావిస్తున్నారు.

వైసిపి ఇన్‌ఛార్జిగా కంభంపాటి విజయరాజు వంటి బలమైన అభ్యర్థిని ప్రకటించడంతో ఆయనకు నాలుగు మండలాల్లో బంధు ప్రీతి ఎక్కువగా ఉండడం, స్నేహితులు, సన్నిహితులు ఎక్కువ ఉండడంతో ఆయనకు ధీటుగా బలమైన అభ్యర్థికి టిడిపి అభ్యర్థిని నియమించాలని అధిష్టానం భావిస్తుంది. ఇప్పటికే పని సర్వేలు చేయించి అభ్యర్థుల భవిష్యత్తును డిసైడ్ చేసినట్లుగా తెలుస్తుంది. ఏ అభ్యర్థికిస్తే చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి గెలుస్తుందని భావిస్తే ఆ అభ్యర్థికి టిక్కెట్ కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా పార్టీ పెద్దలు చెబుతున్నారు. అన్ని సమీకరణలు దృష్టిలో పెట్టుకొని, అందరితో చర్చించి పార్టీ అధిష్టానం అభ్యర్థిని ప్రకటిస్తారని చర్చలు జరుగుతున్నాయి. ఏదైనా ఇక్కడ వైసిపి అభ్యర్థిని ఢీకొనాలంటే అందుకు తగ్గ అభ్యర్థిని బరిలోకి దింపాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజవర్గంలో సత్య సంబంధాలు, బలమైన వ్యక్తులకే అధిష్టానం టిడిపి అభ్యర్థిని ఖరారు చేస్తున్నట్లుగా తెలుస్తుంది.

# 'రా కదలి రా' సభను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

ఈనెల 5న చింతలపూడిలో జరగనున్న బహిరంగసభకు భారీగా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని, జగన్ రెడ్డిని ఇంటికి పంపించటానికి సంసిద్ధం అయ్యారని మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. బుట్టాయగూడెం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు అధ్యక్షతన జరిగిన రా కదలి రా బహిరంగసభ విజయవంతం సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి కెఎస్.జవహర్, నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, నియోజకవర్గం పరిశీలకులు పోతుల అన్నవరం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యంత్రప్రగడ శ్రీనివాస్, తెలుగురైతు కార్యదర్శి గద్దె అబ్బులు, జిల్లా అధికార ప్రతినిధి జారం చాందినీ విద్యా సాగరిక, ఎస్‌టి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఎస్‌టి సెల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, గుండుబోయిన మురళీ, కుందుల శ్రీను, పూసం ముక్కమ్మ, ఆంద్రూ శ్యామ్ కుమార్, కెరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: సభకు సన్నద్ధం అవుతున్న నేతలు

**చాట్రాయి :** మండలంలో అన్ని గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి తెలిపారు. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో బొట్టు విజయచౌదరి ఇంటి వద్ద ఆదివారం టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 5వ తేదీన చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 'రా కదలి రా' బహిరంగ సభను జయప్రదం చేయాలని నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం ఏర్పాటు చేయడమైంది. ఈ కార్యక్రమంలో విజయ మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్ర రావు, చాట్రాయి మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, చీపురుగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు తమ్మిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలకు సీతారెడ్డి భౌతికకాయం అప్పగింత

**ప్రజాశక్తి - చింతలపూడి**

కుటుంబ పెద్ద కన్ను మూయడంతో పుట్టెడు దుఖంలో ఉండి కూడా ఆయన భౌతిక కాయాన్ని వైద్య పరిశోధనల కోసం మెడికల్ కళాశాలకు అందచేసి ఔదార్యాన్ని చూపిందా కుటుంబం..

చింతలపూడి మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన జగ్గవరపు సీతారెడ్డి(72) గుండెపోటుకు చికిత్స పొందుతూ శనివారం రాత్రి హైదరాబాద్ లోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. సీతారెడ్డి భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం స్వగ్రామం ఎర్రంపల్లికి తీసుకువచ్చారు. మరణానంతరం తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఆశ్రమం మెడికల్ కళాశాలకు అప్పగించాలని ఆయన గతంలోనే శరీరదాన పత్రాన్ని ఇచ్చారు. దీంతో సీతారెడ్డి సతీమణి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు జగ్గవరపు సుధారాణి, కుమారుడు రాకేష్ రెడ్డి, కుమార్తె జి.వాహిని, అల్లుడు జిఎస్ఎస్ఎన్.రెడ్డి తమ కుటుంబ పెద్ద ఆశయాన్ని నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. విషయాన్ని ఆశ్రమం కళాశాల యాజమాన్యానికి తెలియపరిచారు. ఆమేరకు ఆశ్రమం కళాశాల సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం ఎర్రంపల్లి వచ్చి శరీరదానానికి సంబంధించిన ప్రక్రియను పూర్తిచేశారు. భౌతిక కాయాన్ని ఏలూరు ఆశ్రమం కళాశాలకు తరలించారు. ఈ సందర్భంగా వందలాది మంది బంధుమిత్రులు, గ్రామస్తులు ఎర్రంపల్లిలో జరిగిన సీతారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబసభ్యుల నిర్ణయాన్ని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు జగ్గవరపు ముత్తారెడ్డి, జానకీరెడ్డి పాల్గొన్నారు.

సీతారెడ్డి (ఫైల్)

# ఆర్యవైశ్యుల సేవాగుణం చాలా గొప్పది

## హోంమంత్రి తానేటి వనిత

**ప్రజాశక్తి - ఏలూరు**

సమాజంలో ఆర్య, వైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, వారి సేవా గుణాన్ని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కొనియాడారు. వారిని అభినందించారు. ఏలూరులోని సిఆర్ రెడ్డి కాలేజి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు అర్బన్ జిల్లాల ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి హోం మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష, కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్కీడ్రిప్ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ తాను ఆర్య, వైశ్యుల ఇంటి బిడ్డనని తెలిపారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గంలోని ప్రతి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంకి చెందిన వెలగా శ్రీరామమూర్తి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షునిగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని కాపాడాలి : సిపిఐ

**ఏలూరు అర్బన్:** వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడటం కోసం రైతులకు తక్షణ సహాయం అందించాలన్నారు. ప్రతి రైతుపై రూ.2 లక్షల 40 వేలకు పైగా అప్పు ఉందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు తెలంగాణ తరహాలో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందే రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులను ఆదుకున్న అంశమే లేదని విమర్శించారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కౌలు రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, బడ్జెట్‌లో కేటాయింపులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని తెలిపారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈనెల 8వ తేదీన రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, ఎఐటియుసి, దళిత హక్కుల పోరాట సమితి, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల కళ్లు తెరిపించే విధంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

## విభజన హామీలు అమలు చేయాలి

### సిపిఎం మండల కన్వీనర్ రమణారావు

**ప్రజాశక్తి - నిడమర్రు**

రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి ఊడిగంజేస్తున్నాయని, ప్రత్యేక హోదా హామీల అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. నిడమర్రులో ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. గవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్మిక హక్కులు కాలరాస్తూ, ఐసిడిఎస్ బలోపేతానికి నిధులు కేటాయించకుండా, పోలవరం నిర్మాణానికి నిధులు ఇచ్చి పూర్తి చేయకుండా, రైల్వే జోను అమలు చేయకుండా, ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ పేరుతో కార్పొరేటర్లకు కట్ట పెట్టిందని దుయ్యబెట్టారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోడీ, జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు అంటే తలూపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన పార్టీలు రాష్ట్ర ప్రజలతో మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కంచ వరప్రసాద్, లావేటి చంద్రరావు, వెలగలేటి మోహన కానూరు రాజు, వి.సోంబాబు పాల్గొన్నారు.

పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ వాయిస్ హైస్కూల్ ఆవరణలో 1974-79 సంవత్సర పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ చిన్న పిల్లల మాదిరి ఆడారు, పాడారు. 50 సంవత్సరాల క్రితం విద్యార్థిగా చదువుకున్న నాటి రోజులలో సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ సమ్మేళనం భావించి ప్రేమానురాగాలతో తమ బాల్య స్మృతులను గుర్తుతెచ్చుకున్నారు. ప్రతి సంవత్సరం తామందరం ఇలాగే కలవాలని వారు కోరుకున్నారు. అర్ధ శతాబ్దపు అపూర్వ సమ్మేళనం అందరిని ఆశ్చర్యపరిచింది.

## మహిళాసేన అధ్యక్షురాలిగా శ్రీదేవి

**ప్రజాశక్తి - ఏలూరు**

ఏలూరు నగర కాపు సంక్షేమ మహిళాసేన అధ్యక్షురాలిగా సూదాబత్తుల శ్రీదేవి చేత రాష్ట్ర మహిళాసేన అధ్యక్షురాలు కరణం కళావతి ప్రమాణ స్వీకారం చేయించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కాపు సంక్షేమసేన అధ్యక్షులు పులి శ్రీరాములు మాట్లాడుతూ కాపుల ఐక్యతకు కృషి చేస్తున్నామన్నారు. కాపు సంక్షేమసేన రాష్ట్ర నాయకులు గంధం లక్ష్మీ సత్య శేఖర్, డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్, హైదరాబాద్ కాపు సంఘం అధ్యక్షులు ఆకుల వెంకటరమణమూర్తి మాట్లాడుతూ కాపు సంక్షేమసేన వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరిరామజోగయ్య అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాను రాష్ట్రంలో అగ్రభాగాన నిలిపిన పులి శ్రీరాములును అభినందించారు.

**దస్తావేజు పోయినది**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, కొమ్మూరు గ్రామ వాస్తవ్యులు అనంతనేని రామచంద్రరావు గారి భార్య అనంతనేని శకుంతల పేరన ఆగిరిపల్లి మండలం, సూరవరం రెవిన్యూ గ్రామంలోని ఆర్.యస్. నెం. 120/4రు దాఖలా య. 0.72 ట్లు మరియు ఆర్.యస్. నెం. 120/5 రు దాఖలా య. 1.46 ట్లు వెరశి య. 2.18 టుల వ్యవసాయ భూమికి సంబంధించిన **ఒరిజినల్ దస్తావేజు (నెం. 2486/1995)** పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

**అనంతనేని శకుంతల**
(భర్త) రామచంద్రరావు
కొమ్మూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 90007 09580

**దస్తావేజు పోయినది**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ వాస్తవ్యులు పొన్నూరు (లేటు) వెంకటాచార్యులు గారి కుమారుడు పొన్నూరు లక్ష్మీ శివ సాంబశివరావు పేరన ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లిలోని సాయిదుర్గా-2 నందు గల వెంచర్‌లో ప్లాట్ నెం. 72 నందు ఆర్.యస్. నెం. 5రు దాఖలా చ॥గ॥ 200.22లు నివేశన స్థలమునకు సంబంధించిన **ఒరిజినల్ దస్తావేజు (నెం. 2846/2012)** పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

**పొన్నూరు లక్ష్మీ శివ సాంబశివరావు**
(తండ్రి) వెంకటాచార్యులు (లేటు)
ఆగిరిపల్లి గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 98667 24343